
# అమ్మడూ హైదరాబాద్





—పోలాప్రగడ సత్యనారాయణ మూర్తి

పుట్టింది పుల్లేటి కుర్రులోనే

అయినా, అమ్మడు మనస్సు మాత్రం చిన్నప్పటినుంచీ, హైద్రాబాదు మీదే: హైద్రాబాదు చీరలన్నా, సికిందరాబాదు సిగలన్నా, సుల్తాను బజారు గాజులన్నా. చికడ్‌పల్లి పేము బుట్టలన్నా అమ్మడు ఎగిరి గంతేసేది. ఎంత డబ్బయినా సరే ఇచ్చి కొనేసేది. ఆ చుట్టుపట్ల ఊళ్ళనుంచి ఎవరు హైదరాబాదు వెళుతున్నా సరే, అమ్మడు ఏదో ఒక సరుకుకొని తెప్పించుకోవలసిందే: 'దొరకలేదు' అని వాళ్ళు అనడానికి వీల్లేదు. 'అబ్బో చాలా ఖరీదు చెప్పా రమ్మా' అంటూ అన్నారా, ఇంక ఊరుకొనేది కాదు.

"అవసరం అయితే మరో నాలుగు రూపాయలు పెట్టక పోయూరా? అటువంటి వస్తువు





మనకి ఇక్కడ ఏం దొరుకుతుందండీ! మిలమిల్లాడే గాజులు, మెరిసిపోయే రిబ్బన్లు, కళ్ళకి మిరుమిట్లు గొలిపే జల్తారు బట్టలు, కనువిందైన వేనిటీ బేగ్‌లు, పేము బుట్టలు, పేస్టుబొమ్మలు, వంకీలు, ఝుంకీలు-అబ్బ! ఆ పట్నం పట్నం అంతా దివ్యకాంతులతో వెలిగిపోయే ఓ దేవేంద్ర లోకం కదాండీ!....మనదీ ఉంది. ఎందుకూ? ఎటు చూసినా ముష్టి చెట్లూ, ముదనష్టపు చేలూను" అంటూ నిట్టూర్చేది.

'నువ్వెప్పుడు చూశావమ్మా? ఆ పట్నం?' అని ఎవరేనా అంటే చాలు, "చూడాలా? చూడ్డం ఎందుకు? ఆ ఊళ్ళో దొరికే వస్తువుల్ని బట్టి తెలియడంలేదూ, ఆ ఊరు ఎంత కలకల్లాడిపోయేదీను" అంటూ ఇంకో అరగంట హైద్రాబాదు స్తోత్రం చదివేది అమ్మడు.

ఇలా ఆ మహాపట్నం గురించి ఈస్టమన్ కలలు కంటూ, కాస్ట్లీ ఊహల్లో తేలిపోయే అమ్మడిని చూసి, "ఒరే రామనాథం! ఇంకెందుకూ నీ కూతుర్ని హైదరాబాదు ఇచ్చెయ్యరా! దాని మనస్సు తీరినట్లూ అవుతుంది. నీవు వెళుతూ వస్తూ నీ హైకోర్టు వ్యవహారాలు చూసుకున్నట్లూ అవుతుంది" అని చుట్టలు కాల్చుకోడానికి అరుగుల మీదకి చేరే మావయ్యలూ బాబయ్యాలూ అంటూ వుంటే, కచేరి చావిట్లోంచి విన్న అమ్మడు, "వీళ్ళు ఎంత మంచివాళ్ళు!" అనుకుంటూ మనస్సులోనే వాళ్ళకి కృతజ్ఞత లర్పించుకొనేది.


హైదరాబాదు పెళ్ళికొడుకు ఎవరేనా వస్తే బాగుండును. అటువంటి వాడిని ఒకడిని పంపించు దేవా! అతను అందంగా లేకపోయినా, పెద్ద ఉద్యోగస్థుడు కాకపోయినా, ఆస్తి లేకపోయినా, ఇంకా ఇంకా ఇలాంటి లోపాలు ఎన్ని ఉన్నా ఏంఫర్వాలేదు. అతను హైదరాబాదు వాడయితే చాలు. తక్కిన ఊళ్ళల్లో కలెక్టరుకంటే, ఆ వూళ్ళో కానిస్టేబుల్ నయం. ఇంచక్కా పట్నంలో కాపురం —రోజూ సాయంకాలాలు పబ్లిక్ గార్డెన్స్‌కీ,టాంక్‌బండ్‌కి షికార్లు— కొత్తగా రిలీజయిన సినిమాలు హాయిగా వారానికి మూడైనా

చూస్తూ, ముద్దినుసు వస్తువులుకొను క్కుంటూ.... అబ్బ! .... ఆపైన, హృదయం అంతా ఆనంద తరంగితమై, ఉక్కిరిబిక్కిరై పోయిన కారణంగా, ఆలోచించలేక పోయేది అమ్మడు.




ఆదేం అదృష్టమోకాని, రాజమండ్రి లాయరూ, విజయవాడ డాక్టరూ, విశాఖపట్నం లెక్చరరూ, గూడూరు కంట్రాక్టరూ వరుసగా ఎవరూ అమ్మడికి నచ్చకుండా పోవడంవల్ల, అనుకున్న ప్రకారం ఆఖరికి హైదరాబాదు సంబంధమే వచ్చింది. అది అమ్మడికి నచ్చింది.

"ఈ కుర్రాడేవిటోయ్, పీలగా పొట్టిగా? బి. యే. అయినా ప్యాస్ కాలేదు అంటున్నావు! డైరెక్టర్ ఆఫీసులో మూడువందలు తెస్తే అయింవా? మొగుడికీ పెళ్లానికీ ముష్టి మూడువంద లేం సరిపోతాయి ఆ పట్నంలో? అబ్బే! మా తాహతుకి తగ్గ సంబంధం కాదు. ఇది"—అంటూ నాన్న చప్పరిస్తూ ఉంటే అమ్మడికి తెగ వళ్లుమండు కొచ్చింది నాన్నమీద.



రాకరాక హైద్రాబాదు సంబంధం వస్తే, నాన్న ఇలా అడ్డుపడతాడేమిటి? అయినా వీర్రాజు మావయ్య మంచి వాడు కనుక, వాళ్ళయింటికి వచ్చిన తన మరదలి కొడుకుని, పెళ్ళికొడుకుగా తీసుకువచ్చి చూపించాడు. అందుకు సంతోషించవలసింది పోయి, అంతస్థులూ తాహతులూ అంటాడేవిటి అర్థం లేకుండాను? తనలో తనే విసుక్కుంది అమ్మడు.

"కల్యాణం ఘడియ తోసుకొస్తూంటే రామనాథం కాదంటే మాత్రం ఆగుతుందా? అందుకే చూడండి! పిల్లాడిని చూస్తూనే టక్కున నాకు నచ్చాడంటూ అమ్మడు ఎలా చెప్పేసిందో!" అంటూ వీర్రాజు తన కట్టుడు పళ్ళని చేత్తో పట్టుకుని, రామనాథాన్ని చూసి నవ్వవలసిన కార్యక్రమం ఏదైతే ఉందో, దాన్ని అంతా పూర్తిచేసి, ఆమీదట, తన పళ్ళని తన నోట్లో భద్రంగా దాచుకుని స్థిమితపడ్డాడు.

"అసలు ఇంతెందుకు? అమ్మడు మూసి నక్షత్ర యుక్త చార్‌మీనార్ లగ్నమందు జన్మించి ఉంటుంది, అందుకే దీనికి అంతంత పెద్ద సంబంధాలు నచ్చక ఈ సంబంధం నచ్చింది" అన్నాడు, అవధానులు నశ్యం రెండు ముక్కుపుటాల్లోకి చప్పుడుతో పీల్చి, ఆ తర్వాత అంగవస్త్రం కోసం అటూ ఇటూ వెతుక్కుంటూ.

"నేను ఆ రోజునే అనుకున్నాను. ఆంధ్ర రాజధాని కర్నూలు నుంచి హైదరాబాదు తరలివెళుతూన్న సుముహూర్తంలో ఈ పిల్ల పుట్టిందే, ఇది కూడా పెద్దదయాక కాపురానికి అక్కడికే వెంచేస్తుందేవిటి చెప్మా అని" అన్నాడు సిద్ధాంతి బంగారు సింహతలాటం ఉన్న తన చేతిని గాలిలో అటూ ఇటూ తమాషాగా ఆడిస్తూ.

"అసలు మన అమ్మడికి చిన్నప్పుడు 'అత్తా తాతా' కంటే హైదరాబాదు, సికిందరాబాదు అనే మాటలే ముందు వచ్చి ఉంటాయని నా అనుమానం" అన్నాడు మొదట్లో అమ్మడిచేత ఓనమాలు దిద్దించిన భైరవమూర్తి మేష్టారు, జేబులో ఉన్న బీడీ తీసి, లావు వేపున ఊది, సన్నం వేపున నోట్లో పెట్టుకుంటూ.


"అమ్మాయికి నచ్చాక ఇంక ఆలశ్యం ఎందుకు? ఆ తాంబూలాల తంతు ఏదో కానిచ్చెయ్యండి" అంటూ సగం అయిష్టతతో నిట్టూర్చింది, అమ్మడు తల్లి సర్వలక్ష్మమ్మ.

అందరి మాటలూ అలా చెవుల్లో

పడుతూంటే. చూస్తూ చూస్తూ ఒక్కగానొక్క కూతురికి ఇంత చిన్న సంబంధం చెయ్యడ మేమిటా అని తటపటాయిస్తూ తల పట్టు కుని కూర్చున్నాడు రామనాథం. అతను ఇంకా తల పట్టుకునే ఉన్నాడు. ఆశ్వయుజ మాసం వెళ్ళ కుండా అమ్మడు పెళ్లి జగదీశ్వర్రా వుతో ఝామ్మంటూ జరిగిపోయింది. ఆ తర్వాత అయిదు రోజులకే అత నితో కలిసి అమ్మడు హైదరాబాదు కాపురానికి వెళ్లిపోయింది.

పుల్లేటికుర్రు నుంచి బయలుదేరి. 'అమలాపురం హైదరాబాదు ఆర్. టి. సి. బస్సు' ఎక్కుతున్న ప్పుడు అస్సలు అమ్మడు మనస్సు మనస్సులోనే లేదు. ఏ మధుర స్వప్నాల వైపో. ఏ స్వర్గధామాల వైపో. తేలిపోయింది. ఎట్టకేలకు తను కలలు కన్న స్వర్గంలోకి వెళు తోంది. అక్కడి సౌఖ్యాలూ. అందాలూ.ఆనందాలూ-ఇంక అన్నీ తనవే!

తను ఇంత క్రితం హైదరా బాదులో ఉండే వాళ్లంతా ఎంతో అదృష్టవంతులని అనుకొనేది. ఇప్పుడా అదృష్టం తనకీ పట్టింది. మధురమైన ఊహలతో పులకించి పోయి. మేఘాలమీద తేలిపోతు న్నట్లు అరమోడ్పు కన్నులతో




బస్సు ఎక్కుతున్న అమ్మడు. కళ్లు వత్తుకుంటూ పక్కనే నిలబడ్డ అమ్మకీ నాన్నకీ కనీసం 'వెళ్లి వస్తాను' అని అయినా చెప్పడం మరిచిపోయింది.

దారిలో జగదీశ్వరరావు ఏవేవో చెప్పుకు పోతున్నాడు తమ కొత్త కాపురం గురించి. అవేవీ అమ్మడు చెవిలో పడడంలేదు. ఆమె దృష్టి ఎంత సేపటికీ హైదరాబాదు ఎప్పుడు వస్తుందా. ఆ స్వర్గ ధామాన్ని ఎప్పుడు చూస్తానా అనే—

మసక మసక వెలుతుర్లో మేలి ముసుగు వేసుకున్న అరేబియా సుందరిలా హైదరాబాదు కనిపించే సరికి. ఆనందంతో ఎగిరి గంతే సింది అమ్మడు. విశాలమైన రాజ వీథుల గుండా పువ్వుల రథంమీద ఊరేగుతూన్న రాజకుమార్తెలా మురిసిపోసాగింది. ఆటోరిక్షాలో అబిడ్స్ సెంటరు మీదుగా తమ అద్దె ఇంటి వైపు ప్రయాణం చేస్తు న్నప్పుడు. రోడ్డుకి ఇటూ అటూ

ఎత్తైన పెద్ద పెద్ద భవనాలు! కన్నానినంత మేరా, విశాలంగా పరుచుకొన్న వీథులు! ఆటో రిక్షా పబ్లిక్ గార్డెన్స్ పక్క నుంచీ, టాంక్ బండ్ మీంచీ పోతూన్నప్పుడు, అమ్మడు ఆనందతరంగితమైన హృదయంలో "సీతారావయ్య గారి అమ్మాయి రోజూ వర్ణించేవి ఇవే అన్నమాట! ఆమెలాగ తను కూడా ఇంక రోజూ భర్తతో కలసి ఇచే కదా షైరు రావడం!" అనుకొంది.

ఆటో రిక్షా. వీథులన్నీ గడచి, చిన్న చిన్న గల్లీలన్నీ దాటి చివరికి ఓ ఇరుకు సందు మొదట్లో ఆగిపోయింది. "మన ఇల్లు ఈ సందులోనే. లోపలికి రిక్షా వెళ్ళదు.దిగు" అని జగదీశ్వర్రావు హెచ్చరించినప్పుడు అమ్మడికల అంతా ఎవరో చెరిపేసినట్లనిపించింది. ఆ సందులో రోడ్డుమీద ఆ పక్క నుంచి ఈ పక్కకి పల్చని నీటి తెరలా కుళ్ళు నీళ్ల ప్రవహిస్తున్నాయి. సందు మొగని ఉన్న చెత్త కుండీ పూర్తిగా నిండిపోయి,చుట్టూ ఎండిపోయిన తుక్కూ, ఈగలు ముసురుతూన్న రకరకాల పదార్థాలూ, కాగితాలూ, కుండ పెంకులూ, చేప పొలుసూ, ఇంత ఎత్తున పడి ఉన్నాయి. చొడు రాలుతూన్న ఓ గోడవారని రెండు కుక్కలు ఒక ఎముక ముక్క కోసం కాట్లాడుకుంటున్నాయి. సందు సందంతా కమురు కంపు కొడుతూ ముక్కు పగిలి పోయేలా ఉంది.

అక్కడక్కడ సీనారేకు డబ్బాలతో అతికిన ఇంటి పైకప్పు, పేకేజీపెట్టె ముక్కల కూర్పుతో చేసిన తలుపులూ, బల్లి పాకినపుడల్లా పెల్లలూడి పడుతూన్న గోడలూ, వీపు తిప్పుకోడానికి కూడా వీలులేని ఒకటిన్నర చిన్న గదులూ, వీథిలో చెత్తా, ఇంటిలో చెమ్మా, సర్వత్రా వ్యాపించిన కుళ్లు కంపూ- ఇవన్నీ 'సత్యజిత్ రే' సినిమాల్లో ఉండే సహజమైన దృశ్యాల్లా తోచి అమ్మడివళ్లు ఒక్కమాటు అసహ్యంతో జలదరించింది. 'ఇదా మన ఇల్లు?' అంది అమ్మడు. ఆ గొంతులో ఎంతో నిరాశ, మరెంతో నిస్పృహాను.

జగదీశ్వర్రావు నవ్వుతూ "ఇదే! ఇంకో అయిదారేళ్ళలో ప్రభుత్వం మనకి క్వార్టర్సు ఇచ్చేదాకా మనం ఇది ఖాళీ చెయ్యక్కర్లేదు. ఏం ముఖం అలా పెట్టావు? నచ్చలేదా? అవున్లే! రెండుహాల్సు, ఒక వసారా ఒక కచేరీ చావిడి, ఎనిమిది గదులు పెద్ద వంటిల్లు, పొడుగాటి పడమటిల్లు ఉన్న రెండు మండువాల లోగిలిలో హాయిగా విశాలంగా మసలిన


దానివి. నీకే ఇల్లు ఇబ్బందిగానూ ఇరుకుగానూ కనిపించడం సహజమే!" అన్నాడు.

వెంటనే అమ్మడు తొట్రుపడుతూ "అబ్బెబ్బె....అదేం కాదు. బాగానే వుంది....అయినా మనిద్దరికీ ఎంత ఇల్లు కావాలేవిటి? రెండు మూడు గదులుంటే చాలవూ?" అంది.

తాము ముందు ముందు నివాసం చేయబోయే ఇల్లు అనే ఆ ప్రదేశాన్ని జగదీశ్వర్రావు అమ్మడికి పరిచయం చేస్తూ, "ఇదిగో! పడక గదీ, డ్రాయింగ్ రూమూ, కొట్టు గదీ, హాలూ, అన్నీ మనకి ఈ గదే! ఇకపోతే మధ్యకి తడక కట్టి రెండుగా విభజించారే. ఆగది; అది- పక్క-




వాటావాళ్ళకీ మనకీ ఉమ్మడి. అంటే తడక ఇవతల భాగం మన వంటిల్లూ, అవతలి భాగం వాళ్ళ వంటిల్లూను. తరుచు మాంసం వండుకోము అని వాళ్ళు హామీ ఇచ్చారులే. అందువల్ల ఆ రకమైన వాసనలు వస్తాయేమో అని భయంలేదు. ఒకవేళ వచ్చినా ఆ గంటసేపూ ఏ పౌడరు డబ్బాయో వాసన చూసు



కుంటూ కూచుంటేసరి! అఁ!....ఈ మధ్యలో ఇంటివారు పెట్టించిన తడకకి మనం ఇంచక్కా ఇటూ అటూవాళ్లఎవరికి ఇష్టమైన అందాల తారల వాల్‌పోష్టర్లూ, ఆకర్షణీయమైన న్యూస్ పేపర్లూ ఎవరికి వాళ్లయథేచ్ఛగాఅంటించుకోవచ్చు. ఇంటివారి అభ్యంతరంఏంఉండదు. ఈ ఒకటిన్నర గదులూ పూర్తిగా మనకే హక్కులున్న మనవాటా.

ఇకపోతే, తలుపుల బదులు గోనె పట్టాలు వేళ్లాడదీసిన బడ్డీ కొట్టులాంటి ఆ బాత్‌రూమూ, రోజు మొత్తంలో గంటన్నరసేపు విశృంఖలంగా నీళ్లవచ్చే ఆ కుళాయీలేవూ? వాటిని తక్కిన అయిదు వాటాల వాళ్లతోటీ సమానంగా ఉపయోగించుకొనే ఉమ్మడిహక్కు మనకి ఉంది. ఇంటికి చీడీలూ అరుగులూ, వీథిలో ఏంలేవని చీదరించుకోకు. అరుగులమీదకి ముసాఫిర్లూ, ముసలి ఆవులూ చేరుకోవడమేగా అని ఇంటివారూ, చీడీలు రోడ్డుమీదికి కాళ్లు జాపుతున్నాయని కార్పొరేషన్ వారూ, ఖర్చు రాసేశారు."

జగదీశ్వర్రావు చేసిన తమ వసతి గృహవర్ణనవి ఓపిగ్గా వింది అమ్మడు. పక్కవాటా వాళ్లద్వారా మరికొన్ని కొత్త విషయాలు మధ్యాహ్నం నేర్చుకొంది. అందులో ముఖ్యమైన పాఠాలు మూడు. ఆడవాళ్లకి హైదరాబాదులో కాలక్షేపం మాట అలా వుంచి వూపిరి పీల్చుకోడానికి ఖాళీ ఉండదనీ, ఇంట్లో పనులతో బాటు వీథిలోంచి సరుకులు తెచ్చుకోవడం, కరెంటు బిల్లు, ఇన్సూరెన్సు ప్రీమియం కట్టివేయడం వంటి పనులు చెయ్యడంకూడా వాళ్ల పనే అనీ, పల్లెటూళ్లలో లాగ పనిమనిషి చాకలీ అనే రెండు తరగతుల మనుష్యుల్ని మరిచిపోవాలనీను — ఈ మూడు పాఠాలూ కంఠతాపట్టి అప్పచెప్పేదాకా పక్కవాటా ఆవిడ, టీచర్ కాబోలు, అమ్మడిని వదలలేదు.

ఆ రోజల్లా ఇల్లు సర్దుకోవడం, కొత్త కాపురం హడావిడితో తను ఆశించిన ప్రకారం పబ్లిక్ గార్డెన్సుకి కాని, టాంక్‌బండ్‌కి కాని షైర్లు వెళ్లలేకపోయింది అమ్మడు. తెల్లవార్లూ దోమలు పాడిన మేలుకొలుపులికి సాయం, తెల్లారగట్ల కాస్త మాగన్నుగా నిద్రపడుతూంటే జగదీశ్వర్రావు ప్రారంభించిన మేలుకొలుపులూ, బహుపరాకులూనూ—


"ఇదిగో చూడు! హైదరాబాదులో అయిదింటిదాకా నిద్రలేవని


వాళ్లకి, ఇంకా రోజల్లా అగచాట్లే! నీళ్లుండవు. పాలుండవు. టైముండదు. తిండివుండదు. వాడి జీవితంలో ఆ రోజులేనట్లే! ....అందువల్ల నా మాట విని బంగారు తల్లిలా లేచి, కుళాయి దగ్గర 'క్యూ'లో నుంచో—నేను వెళ్లి అవతల వీథిలో పాల 'క్యూ'లో పాల్గొంటా. నీళ్లూ పాలూ వచ్చి ఇంట్లో పడ్డాయంటే, తర్వాత సంగతి తర్వాత. కాస్త ఆ కాఫీ చుక్క కనక నాలికమీద పడితే, బియ్యం 'క్యూ' దగ్గిరికి నేనూ, కిరసనాయిలు 'క్యూ' దగ్గిరికి నువ్వూ పరిగెట్టవచ్చు. అన్నట్లు నాకు తొమ్మిది కాకుండా బస్సు




వచ్చేస్తుంది. అప్పటికి భోజనం పూర్తిచేసి ఆ బస్సు అందుకుంటేనే కాని, ఆఫీసుకి అందుకోలేను. అంటే నువ్వు ఎనిమిదిన్నరకే వంట పూర్తి చెయ్యాలన్నమాట. అంటే ఏడున్నరకే మొదలెట్టాలన్నమాట!...అంటే"

ఇంక ఆ 'అంటే....'ల తోరణం వినలేక, అమ్మడు అయి






ష్టంగా తల్పంమీంచి లేచింది. అప్పటినుంచి అన్నిపనులూ పూర్తి చేసి, భర్తని బస్ ఎక్కించి ఆఫీసుకి పంపించేదాకా, కాళ్లూచేతులూ విరగదొక్కుకుంటూ వంచిన నడ్డి ఎత్తకుండా శ్రమపడితేనే కాని, అమ్మడికి విశ్రాంతి లభించలేదు. హమ్మయ్య అని చాప వాల్చుకుని గడపమీద తల ఆన్చిందో లేదో, పక్కింటి వదినగారు "సూపర్ బజారు కారువచ్చింది. అందులో వస్తువులు కొనుక్కుంటే కాస్త చవగ్గా దొరుకుతాయి. ఇవాళ తప్పిస్తే మళ్లీ ఆ కారు వారం దాకా రాదు. నేను వెళ్తున్నాను. మీరు వస్తారా?" అని హెచ్చరించడంతో, రెండు పెద్ద పెద్ద సంచులు తీసుకొని బయలుదేరవలసి వచ్చింది అమ్మడు.

బరువు సంచులతో ఇంటికి చేరేటప్పటికి రెండయింది. సుకుమారమయిన రెండు చేతులూ తెగ నొప్పిపెట్టి పీకుతున్నాయి. అయినా అంట్లు తోముకోక తప్పదు. ఆ చేత్తోనే సబ్బు పట్టించిన బట్టలు ఉతుక్కోవాలి. అమ్మడికి కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. సాయంత్రం జగదీశ్వర్రావు ఆఫీసు నుంచి వచ్చి "ఎక్కడికేనా షైరు వెళదామా" అని అడిగే సరికి, వళ్ళంతా పచ్చి పులుసు అయిపోయిన అమ్మడు. "ఇప్పుడు నేను రాలేను సుమాండీ" అనేసింది.

అదేమాట, చాలా మాట్లుఅంది. సెలవు రోజున జగదీశ్వర్రావు అయితే విశ్రాంతి తీసుకుని కుర్చీలో కూర్చుని సిగరెట్లు కాల్చుకొనేవాడు కాని, అమ్మడికి మాత్రం ఆ రోజున మరింత పనిపడేది. జగదీశ్వర్రావుకి అదనంగా మరో రెండు మాట్లు కాఫీ కలిపి ఇవ్వవలసి


## చెవిలో దూది

రాజు : రవీ! ఎడమ చెవిలో దూది పెట్టుకున్నావేం?

రవి : కుడిచెవిలో విని ఎడం చెవిలో వదిలేస్తున్నానవి మాష్టార్ గారు తిడుతున్నార్రా! అందుకని.


వచ్చేది. ఇల్లు సర్దుకోవడమో, పాతబట్టలు కుట్టుకోవడమో, ఇంటికి ఉత్తరం రాయడమో, ఇలా ఏవో కొన్ని అదనపు పనులు వచ్చిపడి విశ్రాంతి దినం మరింత శ్రమ దినంగా మారి పోయేది. అయినా- జగదీశ్వర్రావుకి ఆదివారం కాని, అమ్మడికేవిటి?

ఇలా, దానాదీనా హైదరాబాదు వచ్చిన నెల్లాళ్ళ దాకా అమ్మడికి ఊరు చూడడమే పడలేదు. ఇంకిది పనికాదని ఓ రోజున తెగించి 'హాలీడే' టిక్కెట్టు కొనమని జగదీశ్వర్రావుకి చెప్పి ఊరు చూడ్డానికి అతనితో కలిసి బయలు దేరింది అమ్మడు.




రోడ్డుకి అవతలి వైపు నుంచి బయలుదేర బోతూన్న బస్ కోసం రోడ్డుకి అడ్డపడి పరిగెట్టడం, కదులుతూన్న బస్ ఎక్కబోయి కాలుజారి రోడ్డుమీద పడడం, డబుల్ డెక్ సరదాలో పైకి ఎక్కి కూచుంటే, దిగవలసిన స్టాప్ దగ్గర దిగలేక పోయి, పక్క స్టాప్‌లో దిగి వచ్చినట్లు వెనక్కి ఒకమైలు దేవుడా





అంటూ నడిచి రావడం. సాలార్ జంగ్ మ్యూజియం జూలాజికల్ పార్క్‌లలో, తిరిగి తిరిగి కాళ్లు పీక్కొచ్చి, వళ్ళంతా చితక్కొట్టి నట్లు అలిసిపోయి, ఆఖరికి ఇల్లు చేరుకునే సరికి స్టౌలో కిరస్నాయిలు అయి పోయిందని తెలియడం. ఇంకాపూటకి అన్నం ఏం వండు కుంటాములే అని బద్ధకించి ఇద్దరూ చెరోకప్పు సింగిల్ చాయ్ తాగి కడుపులో కాళ్ళు పెట్టుకుని పడుకో వడం- దాంతో, "ఓరిదేవుడోయ్! ఇంకెప్పుడూ ఊరు చూడ్డానికి వెళ్ళ కూడదు" అని లెంప లేసుకుంది.

దానికితోడు ఇల్లు కదిలితే చాలు, అయిదేసి, పదేసి రూపాయలు అయి పోతున్నాయి.

ఒకటి రెండు నెలలయి బడ్జెట్ చూసుకొనే టప్పటికి, జగదీశ్వర్రావుకి ఆఫీసులో ఫ్రెండ్స్ దగ్గర తీసుకున్న చేబదుళ్ళు, అమాం బాపతూ రెండు వందలు లెక్క తేలింది. పొదుపుగా ఉంటేనే కాని, చిక్కుల్లో పడతాం అని గ్రహించింది అమ్మడు. దాంతో రెండు పూట్ల కాఫీ అల్లా, ఒక పూటకి దిగింది. మొహానికి రాసుకునే పౌడరూ, కళ్ళకి పెట్టుకొనే కాటుకా, నుదుటను దిద్దుకొనే తిలకం దగ్గర్నుంచి అన్నీ పరిమాణం తగ్గించి ఆదా చేసుకోవలసి వచ్చింది. రిబ్బన్లు మాయం అయ్యాయి, తాళ్ళు వెలిశాయి. చిరిగిన గలేబుల స్థానంలో, కొత్తవి రాలేదు. తుఫాను తాకిడికి, కకావికలై

## ఏడుపు

"పప్పీ! ఎందుకమ్మా ఏడుస్తున్నావ్?"

"డింపుల్‌కి సెలవులిచ్చారు. నాకివ్వలేదు." ముద్దు ముద్దుగా అంది పప్పీ.


"ఏం? మీ స్కూల్‌కి సెలవులు వుండావా!"

"అదికాదు. నీకేం తెలీదు మామయ్యా! నేనసలు స్కూలుకే పోవటం లేదుగా!"




పోయిన తెరచాప గుడ్డలా తయారైంది కిటికీ కర్టెను. రాత్రి భోజనంలో కూర మాయమైంది. మధ్యాహ్నం మిగిలిన అన్నం రాత్రికీ, రాత్రి మిగిలిన అన్నం ప్రొద్దుటికీ సీరియల్ అయింది. చివరికి బ్రతుకు దుర్భరం అయింది.

ఓ రోజు ప్రొద్దుటే ఈ ప్రసారంలో అయిదు గంటలకి నీళ్ళ పంపు దగ్గర క్యూలో నిలబడుట- అయిదూ నలభైకి పాలబూత్ దగ్గరికి పరుగు పందెం. ఆరూ పదికి కాఫీ. ఏడూ పదికి ఒకరు కిరసనాయిల్ క్యూ దగ్గర, మరొకరు బియ్యం క్యూ దగ్గర, ఒకే సమ





యంలో సంచారం. ఏడున్నరకి స్టౌ అంటించడం, ఎనిమిదిన్నరకి అన్నం వడ్డించడం. ఇక రెండో ప్రసారంలో పదిన్నరకి బట్టలు ఉతుకుట, పదకొండూ నలభై అయిదుకి అంట్లు తోముట, పన్నెండున్నరకి ఇన్సూరెన్సు ప్రీమియం కట్టి, ఒంటి గంటకు కొత్త రేషన్ కార్డు కోసం వెళ్ళటం- రెండున్నరకి ఫ్యూజ్ కాల్ ఆఫీసు.మూడింటికి...” అంటూ ఆ రోజు ప్రసార విశేషాల్ని జగదీశ్వర్రావు ఏకరువు పెడుతూంటే. “ఆపండి! ఎవరో వీథితలుపుకొడుతున్నారుచూడండి” అంటూ గదిమింది అమ్మడు.

తలుపుతీసి చూస్తే రామనాథం! అప్పుడే ఎక్స్‌ప్రెస్ బస్సులో దిగినట్లున్నాడు. అమ్మడిని చూస్తూనే “ఇదేవిటే అమ్మాయ్! ఈమధ్య లంఖణాలు చేశావా ఏమిటి? ఈ రూపం, ఈ వాలకం ఏవిటి? ఎలా ఉండేదానివే బంతిలాగా” అంటూ తెగ బాధపడిపోయి, తప్పంతా అల్లుడిదే అయినట్టు కొరకొరా-



అతనికేసి చూశాడు రామనాథం. చేయని తప్పుకి దోషిలా తలవంచుకున్నాడు జగదీశ్వర్రావు. కాఫీల దగ్గర, తన కాపురం సంగతులన్నీ చెప్పి కళ్ళు నీళ్ల పెట్టుకుంది అమ్మడు. రామనాథం నిట్టూర్చి జగదీశ్వర్రావు కేసిచూపి "నాయనా ఎందుకు బాధపడతారు ఇద్దరూ ఇక్కడ. చెప్పండి! నీకు నెలకి మూడు వందలే కదా ఇక్కడ ఇచ్చేది! అంటే ఏడాదికి నాలుగు వేలు లోపు. అవునా? ఆ మాత్రం దానికి ఈ అవస్థలన్నీ ఎందుకు కాని, నిక్షేపంలా నాతో వచ్చేస్తే అక్కడ మన రెండెకరాలకి తోడు, ఇంకో నాలుగెకరాలు కౌలుకి తీసుకుని వ్యవసాయం చెయ్యవచ్చు. ఏడాదికి ఏడెనిమిది వేలు మిగుల్తాయి. శుభ్రంగా నువ్వింత తినవచ్చు. పదిమందికి ఇంత పెట్టవచ్చు. మాకా కంటికి నిండుగా కూతురూ అల్లుడూ రోజూ కనిపిస్తూ ఉంటారు. నా మాటవిను. 'ఊ' అను" అంటూ చేతులు పట్టుకున్నంత పని చేశాడు. "అవునండీ! మా నాన్న చెప్పింది బాగుంది. ఊ....అనండి" అంది అమ్మడు ఉత్సాహంగా. కాస్సేపు వాళ్ళిద్దర్నీ మార్చి మార్చి చూసి "నాకు కొంచెం వ్యవధి ఇవ్వండి ఆలో




చించుకోడానికి" అన్నాడు జగదీశ్వర్రావు. మూడు రోజులకి కాని అతనొక నిర్ణయానికి రాలేకపోయాడు. ఆ నిర్ణయం ప్రకారం అతను ఆఫీసులో రాజీనామా లేఖ ఇస్తే అందరూ తలోరకంగానూ అనుకున్నారు. "మతి పోయిందనీ. ఏదో లాటరీ తగిలిందనీ, ఎమ్. ఎల్. ఏ.గా నిలబడ బోతున్నాడనీ, నిరుద్యోగికి ఒకడికి అవకాశం ఇవ్వడం కోసం ఉదారంగా వెళ్ళిపోతున్నాడనీ" ఇలా లక్ష రకాలుగా ఊహించారే కాని "అమ్మడి హైదరాబాదు రంగుల కల వెలిసిపోయింది. అందుకే ఆమె పుట్టింటికి పుల్లేటికుర్రు వెళ్ళిపోతూ, అతణ్ణి తీసుకుపోతోంది" అని మాత్రం ఎవరూ ఊహించలేకపోయారు. అమ్మడు మాత్రం మొదట ఊహించిందా "పుల్లేటికుర్రు- హైదరాబాదు" ప్రయాణం కంటే హైదరాబాదు పుల్లేటికుర్రు ప్రయాణమే బాగుంటుందని!! ✱